

జిల్లావ్యాప్తంగా శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జరిగిన వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ప్రసంగించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ తదితరులు పాల్గొని మహిళల ఔన్నత్యాన్ని తమ ప్రసంగాల్లో వివరించారు.

మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ





అభళా..

» జిల్లావ్యాప్తంగా ఘనంగా మహిళా దినోత్సవం

6

సముద్రమంత నిర్లక్ష్యం



మచిలీపట్నం పోర్టు పనుల్లో పర్యవేక్షణాలోపం

స్థానిక ఏపీఎంబీ అధికారుల మధ్య వర్గపోరు

మచిలీపట్నం పోర్టు పనులను పర్యవేక్షించే అధికారుల తీరుపై ఏపీ మేరీటైమ్ బోర్డు (ఏపీఎంబీ) ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారా.. పోర్టు పనులను సక్రమంగా పర్యవేక్షించాల్సిన అధికారులు వర్గపోరుతో కొట్లాడుకుంటున్నారా.. ఇలాంటి అనేక అవకతవకలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయా.. ఇటీవల పోర్టు పనులను పర్యవేక్షించే ఏపీ మ్యారిటైమ్ బోర్డు ఉన్నతాధికారులు.. రైట్స్ సంస్థ అధికారులను మంగళగిరిలోని ప్రధాన కార్యాలయానికి పిలిపించి అక్షింతలు వేయడం, ఇదే పద్ధతి కొనసాగితే నేరుగా ముఖ్యమంత్రికి నివేదికను పంపి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని ఏపీఎంబీ సీఈవో ప్రవీణ్ ఆదిత్య హెచ్చరించడం చూస్తే పై ప్రశ్నలన్నీ నిజమేననిపిస్తుంది.

- అనుభవం లేని ఇంజనీర్లతో పని చేయిస్తున్న 'రైట్స్'
- పనులు పూర్తికాకుండానే ఇబ్బడిముబ్బడిగా బిల్లులు
- బ్రేక్ వాటర్ పనుల్లోనూ అవకతవకలే..
- మంగళగిరిలో ఏపీ మ్యారీటైమ్ బోర్డు సమావేశం
- ఏపీఎంబీ, రైట్స్ సంస్థ అధికారులకు హెచ్చరికలు

మచిలీపట్నం పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతం



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం పోర్టు పనులను 2023, మే 22న ప్రారంభించారు. 21 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు 32 శాతం పనులే జరిగాయి. ఈ పనులను వాస్తవంగా ఏపీఎంబీ అధికారులు పర్యవేక్షించాలి. అక్కడ సరిపడా అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఆ బాధ్యతలను కేంద్రప్రభుత్వ సంస్థ అయిన రైట్స్‌కు అప్పగించారు. ఇందుకోసం సదరు సంస్థకు రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సంస్థలో ప్రస్తుతం 15 మందికిపైగా ఇంజనీర్లు పనిచేస్తున్నారు. ఒప్పందం ప్రకారం.. అనుభవం ఉన్న ఇంజనీర్లను ఇక్కడ నియమించాలి. కానీ, పోర్టు పనులను పర్యవేక్షించేందుకు పూర్తిస్థాయిలో అనుభవంలేని ఇంజనీర్లను నియమించారు. ఇటీవల కాలంలో ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసిన వారిని సైతం ఈ సంస్థలో నియమించి, వారితో పనులను పర్యవేక్షిస్తున్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి మిగతా 6లో..

అనేక సమస్యలపై ఆరా

- పోర్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన బ్రేక్ వాటర్ల నిర్మాణంలో ఉపయోగించే రాళ్లు ఎంతమేర వేస్తున్నారు, వాటి చుట్టుకొలతలు, బరువు ఎంతమేర ఉన్నాయనే అంశంపై లెక్కలు కడుతున్నారా, ఈ వివరాలు నమోదు చేస్తున్నారా, అందుకు సంబంధించి రికార్డులు చూపమని ఏపీఎంబీ ఉన్నతాధికారి వివరాలు కోరగా, మచిలీపట్నంలో పనిచేసే ఏపీఎంబీ అధికారులు నీళ్లు నమిలినట్లు సమాచారం.
- పోర్టు ప్రాంతంలోని అంతర్గత రోడ్ల నిర్మాణంలో తొలిదశలో వాడే రబ్బీసు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వస్తోంది. ఈ రబ్బీసు అంత నాణ్యతగా లేకున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే అంశంపై ఉన్నతాధికారి ప్రశ్నించినట్లు తెలిసింది.
- ప్రస్తుతం సముద్రంలో నిర్మిస్తున్న బ్రేక్ వాటర్‌లకు టెట్రా ప్యాడ్‌లను వేస్తున్నారని, వాటి నాణ్యతను గమనించాలనే అంశంపైనా చర్చ జరిగింది. దీంతోపాటు కీలకమైన డ్రెడ్జింగ్ పనులను పూర్తిచేసేందుకు అదనంగా డ్రెడ్జర్లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారి ఆదేశించారు. ఆ పనిచేయకుండా అధికారులు జాప్యం చేస్తుండటం గమనించదగ్గ అంశం.
- పోర్టుకు సంబంధించిన రైల్ మార్గం కోసం ఇంతవరకు అధికారులు సరైన నివేదికలను ఇవ్వకుండా, భూసేకరణలో నెలకొన్న ఇబ్బందులను తొలగించకుండా జాప్యం చేస్తుండటంపైనా ఏపీఎంబీ ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రైలుమార్గం కోసం నివేదికలు ఇవ్వాలని రైల్వే అధికారులు పదేపదే కోరినా, స్థానిక అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

దాదాపు 200 మోటార్ల వైర్లను కత్తిరించిన దుండగులు



వైర్లను కాల్చిన ప్రదేశం



కత్తిరించిన మోటారు కేబుల్ వైరును చూపిస్తున్న రైతు

- » మోటార్లకు వైర్లు లేక లబోదిబోమన్న రైతులు
- » వల్లూరుపాలెం లంకలో ఇది నాల్గోసారి చోరీ
- » పోలీసుల వైఫల్యమే : స్థానిక రైతులు

తోట్లవల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వల్లూరుపాలెం లంక (పోతురాజు గుడి) ఏరియాలో 200 వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను పలువురు దొంగలు కత్తిరించుకుపోయారు. శనివారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు ఈ విషయాన్ని గమనించారు. సబ్ మెర్సిబుల్ మోటారు నుంచి మెయిన్ బోర్డు వరకు ఉండే కేబుల్ వైర్లు కట్‌చేసి ఉండటాన్ని గమనించి ఆందోళన చెందారు. మొత్తం 200 మోటార్ల వరకు లెక్క తేలాయని బాధిత రైతులు చెన్నుపాటి రాధాకృష్ణ, తోట గంగాధరరావు, రావి శ్రీనివాసరావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, బడుగు రామారావు తదితరులు చెప్పారు. ఒక్కో మోటారు వద్ద 20 మీటర్ల కేబుల్ వైరు కట్ చేశారని, మీటరు కేబుల్ వైరు రూ.180 చొప్పున ఉందని, ఈ లెక్కన 200 మోటార్ల వద్ద సుమారు రూ.7 లక్షల కేబుల్ వైర్లు కత్తిరించేశారని సదరు రైతులు చెప్పారు. ఇలా కత్తిరించిన కేబుల్ వైర్లను ఓ ప్రదేశంలో మంటవేసి కాల్చి అందులో వచ్చిన రాగితీగను ఎత్తుకుపోయారని రైతులు తెలిపారు. గతంలో మూడుసార్లు కేబుల్ వైర్లు కట్ చేశారని, ఇది నాల్గోసారి అని పేర్కొన్నారు. మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఒక్క దొంగని కూడా పట్టుకోలేదని, ఇకపై పోలీసులకు ఫిర్యాదు చేయదలచుకోలేదన్నారు. కరకట్టపై సీసీ కెమెరాలు పనిచేస్తే దొంగలు దొరుకుతారని, ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పంటలకు నీరు పెట్టాలంటే మళ్లీ ప్రతి మోటారుకు రూ.3,600 ఖర్చుచేసి కేబుల్ వైరు కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు రాత్రి సమయాల్లో గట్టి నిఘాపెట్టి దొంగలను పట్టుకుని కేబుల్ వైర్ల చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆటంకాలు తొలగేనా..?

ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి

కూటమి ప్రభుత్వం శ్రీకారం

- నిధుల మంజూరుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- కేంద్ర క్రీడల మంత్రి మాండవీయను కలిసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- రూ.27.48 కోట్లు కేటాయించాలని వినతి



విజయవాడ స్పోర్ట్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి రూ.27.48 కోట్లు కేటాయించాలని రాష్ట్ర క్రీడల మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి.. కేంద్ర క్రీడల మంత్రి డాక్టర్ ఎం.మాండవీయాను కోరారు. ఢిల్లీలో శనివారం కేంద్ర మంత్రిని కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ ప్రతిపాదన వెనుక క్రీడాభిమానుల కల ఉందని నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునే వారేరీ..?

రాష్ట్రంలోనే ప్రధాన నగరాల్లో ముందుడే విజయవాడలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ను తిలకించే అవకాశం లేదు. ఎప్పుడో 2002, నవంబరులో ఇక్కడి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇండియా-వెస్టిండీస్ జట్ల మధ్య వన్డే మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌ను తిలకించడానికి నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మందికిపైగా క్రీడాభిమానులు తరలివచ్చారు. ఆ తర్వాత ఈ స్టేడియంలో ఒక్క ఇంటర్నేషనల్ మ్యాచ్ కూడా ఆడింది లేదు. ఇందుకు కారణాలూ లేకపోలేదు. మ్యాచ్ నిర్వహించేందుకు పాలకులకు ఆసక్తి లేకపోవడం ఒక కారణమైతే, ఇక్కడి క్రీడా సంఘాల మధ్య రాజకీయాలు మరో కారణమని మాజీ క్రికెటర్లు చెబుతున్నారు. ముఖ్యంగా స్టేడియం మిగతా 6లో..

అక్రమ రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు జరపాలి

కూటమి ప్రభుత్వంలో పూర్తి విచారణ జరపాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రవాణా శాఖలో వెలుగుచూసిన అక్రమ రిజిస్ట్రేషన్ల కుంభకోణం కేసును తిరిగి దర్యాప్తు చేయాలనే డిమాండ్ వస్తోంది. వాహనాలే లేకుండా... ఈశాన్య రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసినట్టుగా చూపిస్తూ.. లేని వాహనాలకు ఫిజికల్ వెరిఫికేషన్ కూడా పూర్తిచేసి నకిలీ ఆర్సీలను సృష్టించిన విజయవాడ మాఫియా అప్పట్లో అరెస్టైంది. కాగా, ఆ వెంటనే మాఫియా బయటకు వచ్చేసింది. రవాణా శాఖలోని ఇంటిదొంగలు దర్జాగా బయటకు వచ్చి మళ్లీ విధుల్లో చేరారు. ఈ దురాగతాలకు దాదాపు 300కు పైబడి వాహనాలు లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ వాహన్ సైట్‌ను హ్యాక్ చేసి, వాహనాలే లేకుండా ఉన్నట్టుగా నకిలీ ఛాసిస్ నెంబర్లను చూపించి.. ఆయా రాష్ట్రాల నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్లను పొంది.. వాటిని చూపి ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించారు. విజయవాడ కేంద్రంగా డేటా ఎంట్రీ జరగ్గా, అప్పట్లో నెల్లూరు జిల్లా సూళూరుపేటలో ఫిట్‌నెస్ చేసి ఓకే చేశారు. ఫిట్‌నెస్ చేసే క్రమంలోనూ వాహనాలే లేకుండా ఉన్నట్టుగా మిగతా 6లో..



● ప్రోత్సాహం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం భారతదేశ ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సంఘం (ఎలీప్) ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. 30 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

గ్రీన్ సిగ్నల్

త్వరలో విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

జక్కంపూడి నుంచి ఖమ్మం జిల్లా రెమిడిచర్ల వరకు..

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. జక్కంపూడి నుంచి ఖమ్మంజిల్లా రెమెడిచర్ల వరకు జరగనున్న పనులకు 90 శాతానికి పైగా భూ సేకరణ పూర్తిచేసి.. ఆ భూములను జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)కు అప్పగించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. అదే జరిగితే ఈ నెలాఖరుకు పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టు సంస్థ మేఘా సంసిద్ధమవుతోంది.



- » ప్యాకేజీ-3లో 90 శాతం పూర్తయిన భూసేకరణ
- » వెంటనే పనులు చేపట్టేందుకు సిద్ధంగా మేఘా
- » విజయవాడ-నాగ్‌పూర్ ఎకనమిక్ కారిడార్‌లో కీలకం
- » రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే కొత్త ప్రాజెక్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా 405 కిలోమీటర్ల అతిపెద్ద భారీ ఎక్స్‌ప్రెస్ వేకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ భారీ ప్రాజెక్టును మొత్తం 10 ప్యాకేజీల్లో చేపడుతున్నారు. ఇందులో ఏపీ, తెలంగాణాలో 89.43 కిలోమీటర్ల నిడివి ఉంది. దీంతో విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 3 ప్యాకేజీల ప్రాతిపదికన టెండర్లు పిలిచారు. ఖమ్మం జిల్లా వి.వెంకటాయపాలెం నుంచి బ్రాహ్మణపల్లి వరకు 30 కిలోమీటర్ల మేర మొదటి ప్యాకేజీ పనులను దినేష్ చంద్ర అగర్వాల్ ఇన్ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రూ.747 కోట్లకు దక్కించుకుంది. ఈ పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. రెండో ప్యాకేజీలో భాగంగా ఖమ్మం జిల్లా బ్రాహ్మణపల్లి నుంచి రెమెడిచర్ల వరకు 30 కిలోమీటర్ల మేర మేఘా సంస్థ దక్కించుకుంది. ఈ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఇక అత్యంత కీలకమైన మూడో ప్యాకేజీ పనులు ఖమ్మంజిల్లా రెమెడిచర్ల నుంచి ఎన్టీఆర్ జిల్లాలో జక్కంపూడి వరకు 30 కిలోమీటర్ల మేర చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితేనే రెండు రాష్ట్రాల మధ్య ఎక్స్‌ప్రెస్ వే అనుసంధానమవుతుంది. అలాగే, విజయవాడ-నాగ్‌పూర్ మిగతా 6లో..

భూ సేకరణ ప్రక్రియ ఇలా..

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనుల్లో ఎన్టీఆర్ జిల్లాలో 30 మీటర్ల అలైన్‌మెంట్‌కు సంబంధించి 243.67 ఎకరాల మేర భూములు అవసరమయ్యాయి. విజయవాడ రూరల్ మండలంలో రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి గ్రామాల్లో, జి.కొండూరు మండలంలోని సున్నంపాడు, దుగ్గిరాలపాడు, మునగపాడు, గడ్డమణుగు, కొండూరు, పేత్రంపాడు, గంగినేనిపాలెం, తెల్లదేవరపాడు, చెరువు మాధవరం, పినపాక, కవులూరు గ్రామాల్లో భూములు సేకరించాల్సి వచ్చింది. గంపలగూడెం మండలంలో తునికిపాడు గ్రామంలోనూ భూములు సేకరించారు.



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (ఆది)

సహర్ (ఉదయం) : 5-00 (సోమ)

వైద్య విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి

హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి


బెలూన్స్ ఎగురవేస్తున్న రాధికారెడ్డి

గన్నవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు క్రీడలకు తగిన ప్రాధాన్యతనివ్వాలని హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 26వ పురుషుల ఇంటర్ మెడికల్ గేమ్స్ మీట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి లోనవుతారని చెప్పారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం చేకూరుతుందన్నారు. యూనివర్సిటీ క్రీడలను ప్రోత్సహించేందుకు బడ్జెట్‌ను కేటాయిస్తుందని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నతులుగా ఎదగాలని చెప్పారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డాక్టర్ రెహమాన్, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఇత్రిమూర్తి, దేవినేని రవి తదితరులు పాల్గొన్నారు.

ఆ 'అసైన్డ్' బదలాయింపుపై నిషేధం లేదు : హైకోర్టు

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు 1954కి ముందు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమి విక్రయానికి ఎలాంటి నిషేధంలేదని హైకోర్టు మరోసారి పునరుద్ఘాటించింది. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి కృష్ణజిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామం పరిధిలో నల్లూరు వెంకటస్వామికి 1942లో రెవెన్యూ అధికారులు భూమిని అసైన్డ్ చేశారు. వెంకటస్వామి కుమారుడు సత్యానందం, కోడలు రత్నమ్మ సర్వే నెం. 177/ఏ1లోని 0.66 సెంట్ల భూమిని 1966లో ఉప్పలపాటి రాజారత్నంకు విక్రయించారు. ఈ భూమి వారసత్వంగా యుఎస్‌వీ బలరామ్‌కు దక్కింది. అయితే ఈ భూమిని జిల్లా కలెక్టర్ అసైన్డ్ భూమిగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు, వాటి ఆధారంగా విజయవాడ పటమట సబ్‌రిజిస్ట్రార్ భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ యుఎస్‌వీ బలరామ్ 2009లో హైకోర్టును ఆశ్రయించారు. కలెక్టర్ ఉత్తర్వులను రద్దు చేసి, భూమిని రిజిస్టర్ చేసేలా సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం పై తుది విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రాయ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ...1942 బోర్డ్ స్టాండింగ్ ఆర్డర్స్(బీవోఎస్-15) ప్రకారం వెంకస్వామికి అధికారులు భూమిని కేటాయించారన్నారు. ఆ సమయంలో అసైన్డ్ భూమి విక్రయం పై ఎలాంటి నిషేధం లేదన్నారు. అసైన్డ్‌భూమిని వారసులు అనుభవించడానికి తప్ప వేరొకరికి బదలాయించడానికి వీల్లేదని నిబంధన తీసుకొస్తూ 1954 జూన్ 18న రెవెన్యూశాఖ జీవో 1142 జారీ చేసిందన్నారు. ఆ తరువాత 1977లో అసైన్డ్ భూముల బదిలీ నిషేధిత చట్టాన్ని తీసుకొచ్చారని వివరించారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ భూమి అసైన్డ్ భూమి నిర్వచనం పరిధిలోకి రాదన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి 1954జూన్ 18కి ముందు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమి విక్రయానికి ఎలాంటి నిషేధంలేదని, రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా నుండి భూములను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2018 నవంబర్‌లో ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ భూమిని అసైన్డ్ భూమిగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

సముద్రమంత నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. వీరిని మార్చాలని మచిలీపట్నం పోర్టు వద్ద పనిచేస్తున్న ఏపీఎంబీ అధికారులు మంగళగిరి ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులకు లేఖ కూడా రాశారు. అయినా మార్పలేదు.

ఓ ఇంజనీర్ కనుసన్నల్లో..

మచిలీపట్నం పోర్టు పనులను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ చేసిన పనుల అంచనాలను రైట్స్ సంస్థ సమోదుచేసి, ఏపీఎంబీకి పంపాలి. ఆ బిల్లులను ఏపీఎంబీ అధికారులు ప్రభుత్వానికి పంపుతారు. దీనిని సాకుగా తీసుకుని ఏపీఎంబీలో పనిచేసే ఇంజనీర్ ఒకరు అంతా తన చేతుల్లోకి తీసుకుని తెరవెనుక చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశాన్ని గ్రహించిన ఏపీఎంబీ ఉన్నతాధికారి మచిలీపట్నం పోర్టు పనులను తనిఖీ చేసేందుకు వచ్చిన సమయంలో సదరు ఏఈని తనదైనశైలిలో హెచ్చరించారు. పనుల నాణ్యత పరిశీలనలో చూపాల్సిన శ్రద్ధ, బిల్లులు చేయడంలో చూపుతున్నారని, ఇదేం పద్ధతి అని నిలదీశారు. దీంతో స్థానిక అధికారులు ఖంగుతిన్నారు. నీటిపారుదల శాఖ నుంచి డెప్యుటేషన్‌పై ఏపీఎంబీకి వచ్చిన ఈ ఏఈ ఎంతకాలం పాటు ఇక్కడ పనిచేస్తారనే అంశంపైనా ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏపీఎంబీ ఈఈ, డీఈలకు షోకాజ్ నోటీసులు కూడా జారీచేశారు. ఈ నోటీసులకు స్థానిక ఏపీఎంబీ అధికారులు ఇచ్చిన సమాధానంపైనా ఏపీ మేరిటైమ్ బోర్డు ఉన్నతాధికారులు సంతృప్తి చెందలేదని అధికారులు చెప్పుకొంటున్నారు. పనులు సక్రమంగా చేయకున్నా నెలకు రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల మేర బిల్లులు పెడుతున్నారని, ఈ బిల్లులు ఎలా చేయాలని ఏపీఎంబీ ఉన్నతాధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఇటీవల కాలంలో మచిలీపట్నం పోర్టు పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఎంబీ, రైట్స్ సంస్థ అధికారులను మంగళగిరిలోని కార్యాలయానికి పిలిపించి, సమీక్ష నిర్వహించిన సమయంలో ఉన్నతాధికారులు ఇక్కడి లోపాలను ఎత్తి చూపారు. పని తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని ఉన్నతాధికారి హెచ్చరించారు.

ఆటంకాలు తొలగేనా..?

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం ఇంకో కారణంగా పేర్కొంటున్నారు. స్టేడియం నిర్వహణలో మున్సిపల్ కార్పొరేషన్ పూర్తిగా విఫలం కావడం కూడా ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో మంగళగిరిలో నిర్మాణంలో ఉన్న స్టేడియం పూర్తయితే అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌లు చూడొచ్చన్న నగరవాసుల కోరిక కూడా కలగానే ఉండిపోయింది. కాగా, వన్డే మ్యాచ్ కాకపోయినా టీ20 మ్యాచ్‌నైన నగరవాసులకు అందించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. కానీ, ఆశించిన ఫలితం అందలేదు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం క్రీడలపై చిన్నచూపు చూడటంతో క్రీడాభివృద్ధికి ఒక్క అడుగు పడింది లేదు. మళ్లీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే క్రీడల అభివృద్ధికి నడుం బిగించింది. ఇందులో భాగంగానే స్టేడియాన్ని అభివృద్ధి చేసి టీ20 మ్యాచ్‌లను నగరంలో నిర్వహించేందుకు నిధులను సమకూర్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.

అక్రమ రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు జరపాలి

(5వ పేజీ తరువాయి)

చూపించారు. ఈ వ్యవహారంలో ఆర్సీల కోసం డబ్బు ఇచ్చిన వారిని వదిలేశారు. కనీసం విచారణకు కూడా పిలవలేదు. అప్పట్లో ప్రాథమిక విచారణలో ఈ బాగోతాలు బయటపడ్డాయి. ఆ తర్వాత రవాణా శాఖ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పునః విచారణ జరపాలనే డిమాండ్ వస్తోంది.

గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

నడుమ అనుసంధానం ఏర్పడుతుంది. ఇక ప్యాకేజీ-1, 2 పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్యాకేజీ-3 పనులు ఇప్పటి వరకు మొదలు కాలేదు. ఈ పనుల కోసం ఎన్టీఆర్ జిల్లాలో 30 ఎకరాల మేర భూములను సేకరించారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ సేకరణలో తీవ్ర జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక భూ సేకరణ ప్రక్రియను 90 శాతం పూర్తి చేశారు.

సమస్యల బడి

దీనావస్థలో మోటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- ప్రహరీ లేదని రద్దయిన టెన్త్ పరీక్షా కేంద్రం
- షెడ్డు లేక పాడైపోతున్న విద్యార్థుల సైకిళ్లు
- సరైన గ్రౌండ్ లేక ఆటలకు దూరం
- నిధుల విడుదలపైనే ఉపాధ్యాయుల ఆశలు


మోటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గుడివాడ రూరల్, మార్చి 8 (ఆంధ్ర జ్యోతి): గుడివాడ రూరల్ మండలం మోటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనేక సమస్యలతో సతమతమవుతోంది. గతంలో ఎంతో వైభవంగా వెలిగిన పాఠశాల నేడు దీనావస్థలో ఉంది. మాజీ ఎమ్మెల్యే ఘంటా కృష్ణమూర్తి ఐదు ఎకరాల స్థలం ఇవ్వగా, సువిశాలంగా పాఠశాల ఏర్పడింది. ప్రస్తుతం కనీస వసతులు కరువయ్యాయి. గతంలో చౌటపల్లి, పెదపాలపర్రు, పర్నాస, మోటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు మోటూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసేవారు. చుట్టూ ప్రహరీ లేకపోవటంతో గత సంవత్సరం పరీక్షా కేంద్రం రద్దు చేశారు. పదవ తరగతి విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్లి పరీక్ష రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉన్నత పాఠశాల విద్యార్థులు 260 మంది ఉన్నారు. వీరు సైకిళ్లు వేసుకుని వస్తారు. ఈ సైకిళ్లు పెట్టుకోవటానికి షెడ్డు లేదు. ఎండకు ఎండి, వర్షానికి తడుస్తున్నాయి. వర్షం వస్తే విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. మండలంలోనే సువిశాలమైన ప్లే గ్రౌండ్ ఉన్నప్పటికీ దానికి వసతులు లేకపోవటంతో విద్యార్థులు ఆడుకునే అవకాశం కోల్పోతున్నారు. పాఠశాల భవన నిర్మాణాలు, మరమ్మతులు, ప్రహరీల నిమిత్తం నాడు - నేడు కింద సెకండ్ ఫేజ్‌లో రూ.కోటి 46 లక్షలు ప్రభుత్వం నిధులు కేటాయించగా, కేవలం రూ.34 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. వాటిలో రూ.5 లక్షలను వేరే పాఠశాలకు మరలించారు. మిగిలిన రూ.29 లక్షల్లో బాత్ రూమ్‌లు, మెయింటెన్స్, సీలింగ్ ఫ్యాన్లు కొన్ని మాత్రమే చేయగలిగారు. ప్రస్తుతం నిధులు లేక, కనీస వసతులు కరువై ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిధుల్లేక ఇబ్బంది పడుతున్నాం : హెచ్‌ఎం

పాఠశాల నిర్వహణకు కూడా నిధుల్లేక ఇబ్బంది పడుతున్నామని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు 29 మంది ఉన్నారని, వీరు పరీక్ష రాయటానికి మోటూరు గురుకుల పాఠశాలకు వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిధులు విడుదల చేస్తేనే పాఠశాల అభివృద్ధి జరుగుతుందన్నారు.

త్వరలో నిధులు : ఎంఈవో

గత ఫిబ్రవరి 25వ తేదీన జరిగిన రివ్యూ మీటింగ్‌లో మోటూరు ఉన్నత పాఠశాలకు నిధులు విడుదల చేయాలని కోరామని గుడివాడ ఎంఈవో బాలాజీ తెలిపారు. దీనిపై స్పష్టంగా రివ్యూ జరిగిందన్నారు. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు.


సైకిల్ స్టాండ్ లేక ఎండలో మాడుతున్న విద్యార్థుల సైకిళ్లు, ఉపాధ్యాయుల వాహనాలు


అధ్వానంగా ఆట స్థలం

మహిళా సంక్షేమానికి రూ.4,392 కోట్లు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్
- మచిలీపట్నంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- 10 మంది మహిళలకు అవార్డుల ప్రదానం


మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ హారిక


గోవాడ ప్రశాంతికి అవార్డు అందిస్తున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4,392 కోట్లు కేటాయించామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన 10 మంది మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అన్ని వృత్తుల్లో మహిళలు రాణిస్తున్నారని, ఆడపిల్లలను చదివించాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ పిల్లలకు వీరనారీ మణుల విజయగాథలు బోధించాలన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ మహిళలు చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించుకుని వృద్ధిలోకి రావాలన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ బాలికల రక్షణకు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098, సఖీ వన్‌స్టాప్ సెంటర్ హెల్ప్‌లైన్ సెంటర్ 181 ద్వారా భద్రత కల్పిస్తున్నామన్నారు. జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ తాను కష్టపడి చదువుకుని పైకివచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్, మెప్మా పీడీ ఏ. సాయిబాబా, ఆర్డీవో కె.స్వాతి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వెంకట్రావు, ఐసీడీఎస్ పీడీ రాణి, డీఎంహెచ్‌వో శర్మిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న నారీమణులు

మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, ప్రధాని, రాష్ట్రపతి వద్ద వీణావాదనం చేసిన అప్పికట్ల దీప్తి, మిద్దెతోటలు పెంచి సీఎం చంద్రబాబు నుంచి అవార్డు తీసుకున్న ముంతాజ్ బేగం, 70 ఏళ్ల వయసులో క్రీడా రంగంలో 75 పతకాలు సాధించిన తోట విజయకుమారి, భగవద్గీత విద్యార్థులకు నేర్పుతూ మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ నుంచి స్వర్ణపతకం పొందిన జొన్నలగడ్డ మాధవి, ప్రముఖ కథారచయిత్రి మేరీ కృపాబాయి, వాసవీ మహిళా మండలి ప్రతినిధి వేముల శిరీష, మచిలీపట్నం చిలకలపూడిలో 20 ఏళ్లుగా అన్నపూర్ణ వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న కరెడ్ల సుశీల, మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు గోవాడ ప్రశాంతిలను అవార్డుతో సత్కరించారు.

చెక్కుల పంపిణీ

256 స్వయం సహాయక సంఘాలకు రూ. 29.59 కోట్లు, స్త్రీ నిధి ద్వారా 3,863 స్వయం సహాయక సంఘాలకు రూ.120.20 కోట్లు, మెప్మా ద్వారా 43,660 మంది మహిళలకు రూ.686 కోట్లు, 4,633 మంది బీసీ, కాపు, ఈబీసీ మహిళలకు శిక్షణ కోసం రూ. 11.58 కోట్ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ, మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, పోలీసు శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా అప్పికట్ల దీప్తి వాణావాదనంతో పాటు పలువురు కళాకారులు నృత్య, కోలాట ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

జగన్‌రెడ్డికి మతిస్థిమితం లేదు

మంత్రి వాసంశెట్టి

మచిలీపట్నం టౌన్, మార్చి 8 (ఆంధ్ర జ్యోతి) : మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మానసిక స్థితి సరిగ్గా లేదని మంత్రి వాసంశెట్టి సుభాష్ ధ్వజమెత్తారు. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకే భావాలు కలిగిన కేఏ పాల్ స్థాపించిన ప్రజా శాంతి పార్టీలో జగన్‌మోహనరెడ్డి చేరడం మంచిదన్నారు. 22 మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినా చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ఉండి ప్రజా సమస్యలపై పోరాడారన్నారు. చంద్రబాబు ఒక్కడే తన వాదనను అసెంబ్లీలో వినిపిస్తుంటే, జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పలేకపోయారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు 40 శాతం ఓట్లు వేసినా జగన్‌మోహనరెడ్డి అసెంబ్లీలో వారి సమస్యలపై మాట్లాడకపోవడంపై సిగ్గుచేటన్నారు. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి మహిళలను అగౌరవపరిచే విధంగా మాట్లాడారన్నారు. మహిళలను తూలనాడితే కూటమి ప్రభుత్వం తగిన శిక్ష విధిస్తుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే హక్కు మాజీ సీఎం జగన్‌రెడ్డికి లేదన్నారు. టీడీపీ నాయకులను బాగా తిట్టిన వారికి జగన్ మంత్రి పదవులు ఇచ్చారని ఆయన విమర్శించారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం


తెలుగు మహిళలతో ఎమ్మెల్యే రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

గుడివాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీవోస్ హోం, రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్‌కేపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను సత్కరించారు. పలు సాంస్కృతిక, క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు వాణి, కోశాధికారి జయంతి, ప్రముఖ వైద్యులు చింతపల్లి సుగుణావతి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఎన్‌జీవోస్ అసోసియేషన్ తాలుకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కేపీరావు, జి.రాజేంద్ర ప్రసాద్, ఎస్‌కేపీ ఫౌండేషన్ ఆర్గనైజర్ తార తదితరులు పాల్గొన్నారు. కాగా, టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా ఆదిమాంధ్ర సంఘం, శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజర్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ పాల్గొన్నారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఇందిరాదేవి, వైద్యులను సత్కరించారు. కమిటీ అధ్యక్షులు చాగంటిపాటి దేవేంద్రుడు పాల్గొన్నారు. బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) ఆధ్వర్యంలో టూటౌన్ స్టేషన్‌లోని మహిళా పోలీసులను సత్కరించారు. సీఐ సిహెచ్. నాగప్రసాద్, బీజేపీ నాయకులు అంగడాల సతీష్, సూరే గాంధీ, బోనం గోపిక, రీటా పాల్గొన్నారు. సుందరయ్యభవన్‌లో ఐద్వా కార్యదర్శి పి.రజని ఆధ్వర్యంలో కవయిత్రి చోడవరపు రూపను సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, ప్రజానాట్యమండలి అధ్యక్షురాలు పి.వీరమ్మ, సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు శేషగిరిరావు, సభ్యులు యు.రాంబాబు, రామదేను వేణుబాబు, అన్నే నవీన్, విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికలో..

స్థానిక ప్రజావేదికలో తెలుగు మహిళలు ఏర్పాటు చేసిన కేక్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, కూటమి నాయకులు మజ్జి శ్రీనివాసరావు, గోకవరపు సునీల్, చేకూరు జగన్మోహనరావు, తెలుగు మహిళలు శైలజ, కొల్లి రమ్య, పొట్లూరి రమాదేవి, మెటోరా, మల్లికాబేగం, జయశ్రీ, శాంతి, మాదాల సునీత, గొర్ల శ్రీలక్ష్మి, దివ్యచౌదరి, మరీదు కరుణ పాల్గొన్నారు.


పామర్రులో మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

పామర్రు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్ని రంగాల్లో చేయూతనిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు సాగాలన్నారు. అనంతరం పార్టీకి సేవలందించిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ మండల అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, జక్కా శ్రీనివాసరావు, లింగమనేని రామలింగేశ్వరరావు, వీరపనేని శివరామ్, టీడీపీ, జనసేన నేతలు అంబాటి రాజ్యలక్ష్మి, కాకి ఝాన్సీ, మైనేని ఇందిర, గుత్తికొండ పద్మ, బావురిపల్లి పద్మజ పాల్గొన్నారు.

నవ్యాంధ్ర అభివృద్ధిలో కీలక పాత్ర


మహిళా నేతలతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి8(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారం చేపట్టడంలో, నవ్యాంధ్ర అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైనదని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలు అధికారంలోకి రావడానికి అంకితభావంతో పనిచేసిన మహిళా నేతలు, కార్యకర్తలను ఘనంగా సన్మానించారు.

వశిష్ట మహిళా జూనియర్ కళాశాలలో..

కానూరు వశిష్ట మహిళా జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కృష్ణాజిల్లా హ్యూమన్ రైట్స్ జనరల్ సెక్రటరీ చిల్లకూరి నాగలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను కష్టపడి చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు.

శక్తికి ప్రతీక మహిళ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : మహిళలు శక్తికి ప్రతీకలని మెడివ్యాలీ ఎండీ పి.రమేష్‌చక్రవర్తి అన్నారు. ఎస్.ఎన్.పాలెంలోని మెడి వ్యాలీ ఆవరణలో హనుమాన్‌జంక్షన్, తేలప్రోలు లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ పోలిశెట్టి జ్యోతి, సుజాతలను ఘనంగా సత్కరించి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా కార్యవర్గ సభ్యులు భానుసుందర్‌కుమార్, స్వామి, రాఘవేంద్రరావు, ప్రవల్లిక, రఫియా, సంధ్య, భవాని, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ

ప్రసాదంపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం ప్రసాదంపాడులోని టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. తొలుత మహిళలతో కలిసి యార్లగడ్డ వెంకట్రావు కేక్ కట్ చేశారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి కూటమి మహిళా నేతలు, మహిళా కార్మికులు, వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన మహిళను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గూడవల్లి నర్సయ్య, విశ్రాంతి ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, మహిళా నాయకులు మండవ లక్ష్మి, మేడేపల్లి రమ, పొదిలి లలిత, చిక్కవరపు నాగమణి, బొమ్మసాని అరుణకుమారి, కంభంపాటి లక్ష్మి, గుజ్జర్లపూడి అజిత తదితరులు పాల్గొన్నారు.

నాడు టీడీపీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారు

టీడీపీ అధినేత చంద్రబాబుకు గతంలో రాజ్యాంగబద్ధంగా ఉన్న ప్రతిపక్ష హోదా తొలగించేందుకు జగన్ విశ్వప్రయత్నాలు చేసి విఫలమయ్యారని విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి వైసీపీలోకి తీసుకున్నట్లు మాజీ సీఎం జగన్ అప్పట్లో తనకు స్వయంగా తెలిపారన్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు లొంగకపోవడం వల్లే ఏం చేయలేకపోయారని చెప్పారు. జగన్‌కు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రహదారులు గుంతలమయం అయ్యాయని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రోడ్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారని కొనియాడారు. జగన్ చేయాల్సిన పనులను పవన్ చేస్తుంటే అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొండగట్టు వాసుల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కొండగట్టుపై ఉంటున్న వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. ముస్తాబాద హైస్కూల్ ఎదురుగా ఉన్న కొండగట్టుపై సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, కొన్నేళ్లుగా పేదలు కొండగట్టుపై ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నాయకులు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, రాంబాబు, ఏసు దాసు, సరస్వతీ, ఆంతోని, శౌరి, సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

వైభవంగా సీతారామచంద్రమూర్తి శతాబ్ది మహోత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరులోని సీతారామ చంద్రమూర్తి స్వామి శతాబ్ది మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముత్తేవి వెంకట సత్యనారాయణాచార్యుల పర్యవేక్షణలో మును నూరి శ్రీనివాసరావు, పద్మజ దంపతులు దీక్షా సంబంధిత వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం జరిగే నూతన కలశ, గోపుర పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొంటారు.



సీతారామచంద్రమూర్తిని దర్శించుకుంటున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కేసరపల్లిలో యువకుడు ఆత్మహత్య

గన్నవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొల్లిపర దేవేంద్ర రంగారావు(22) ప్రేమించిన అమ్మాయికి మరో వ్యక్తితో వివాహం కుదిరింది. దీంతో మనస్థాపానికి గురైన ఆ యువకుడు ఉరి వేసుకున్నాడు. కుటుంబీకులు గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

శక్తికి ప్రతిరూపం మహిళ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఉయ్యూరు న్యాయాధికారి కె. శ్రీహరి

ఉయ్యూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, మహిళ శక్తికి ప్రతిరూపమని జూనియర్ సివిల్‌జడ్జి కె శ్రీహరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం మండల లీగల్ సెల్ అథారిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టులో మహిళా ఉద్యోగులు, మహిళా అడ్వకేట్‌లను సత్కరించి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరలు అందజేశారు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొని మహిళా కౌన్సిలర్లు, ఉద్యోగులను సత్కరించారు.

పెనమలూరు : మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో తమ సర్వీసులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళా మణులను ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెదపులిపాక గ్రామ పంచాయతీలో సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి పంచాయతీ సభ్యురాలు చనుమోలు అన్నపూర్ణమ్మతో పాటు వార్డు సభ్యులను సత్కరించారు.

● పెనమలూరు పోలీసుస్టేషన్లో మహిళా సిబ్బందిని సీఐ వెంకటరమణ, ఎస్సైలు ఘనంగా సత్కరించారు.

● యనమలకుదురులోని అమరావతి బాలోత్సవ్ సెంటర్లో మహిళాసంఘం ఆధ్వర్యంలో మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షురాలు షేక్ వలీబీ అధ్యక్షతన జరిగిన ఉత్సవాల్లో కమిటీ నాయకురాలు షేక్ బీజాన్‌బీ, శైలజ, లావు అనిత, సైకం రమ్యకృష్ణ, షేక్ ఖాసింబీ, షేక్ కాసిం, షేక్ మస్తాన్ వలి, లావు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంకిపాడు ఎంపీపీ రాజ్యలక్ష్మి

కంకిపాడు : మహిళాభివృద్ధే కూటమి లక్ష్యమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని దావులూరులో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని విజన్ ఇండియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజన్ ఇండియా డైరెక్టర్ ఏజే బాబుపాల్గొన్నారు. ఈడుపుగల్లు పంచాయతీ వద్ద నిర్వహించిన మహిళా దినోత్సవంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బాకి రమణ, పంచాయతీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

గన్నవరం : మండలంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి కోడె యామిని, జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, లక్ష్మీ తదితర మహిళలను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ చైర్మన్ కేవీఆర్ కిషోర్, తిరివీధి వెంకయ్య, నగ్గుర్తి శ్రీనివాసరావు, హెచ్‌ఎం కెవిఎస్ జగదీశ్వరరావు, చిమట రామారావు తదితరులు పాల్గొన్నారు.





పెనమలూరు పోలీసు స్టేషనులో మహిళా సిబ్బందికి సత్కారం.. ఆత్కూరు పీఎస్‌లో..



బహుమతులు అందజేస్తున్న ఉయ్యూరు న్యాయాధికారి శ్రీహరి

ఉంగుటూరు : మహిళా అభ్యున్నతి, సాధికారతతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని, అందుకు లింగవివక్షలేని నవ సమాజ నిర్మాణం సాకారం కావాలని ఎస్సై చావా సురేష్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పలువురు మహిళా కానిస్టేబుళ్లను ఎస్సై, ఏఎస్సై రామారావు నేతృత్వంలో ఘనంగా సన్మానించారు.

హనుమాన్‌జంక్షన్ : మహిళలకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పించాలని మానవత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినత్సోవం సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో వేడుక నిర్వహించారు. జంక్షన్ సిద్ధార్థ విద్యాలయం ప్రిన్సిపాల్ వీరమాచనేని ధనలక్ష్మిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మానవత జంక్షన్ శాఖ అధ్యక్షుడు జి. జయరామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సత్కరిస్తున్న గన్నవరం వాకర్స్ అసోసియేషన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి మమతపందిరి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పిల్లా అనిత, ఆశాజ్యోతి మానసిక దివ్యాంగ సొసైటీ డైరెక్టర్ మాధవీలత, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి తదితర 50 మంది మహిళలను వ్యవస్థాపక అధ్యక్షుడు లంక రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లంక సురేంద్ర మోహనబెనర్జీ, గుండపనేని ఉమా వరప్రసాద్, లంక అజయ్, ఆళ్ల గోపాలకృష్ణ, ఉపేంద్ర, వేములపల్లి శ్రీనివాసరావు, నందమూరి మురళీకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

8 మందిపై కేసు నమోదు

గన్నవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్‌లో సరిహద్దు రాళ్లను తొలగించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమ స్థలంలో వేసిన సరిహద్దు రాళ్లను కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయటంపై పోలీస్ స్టేషన్‌లో భూ యజమానులు దొండపాటి వెంకటేశ్వరరావు, గుమ్మడి ఉషారాణి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఆర్‌ఎస్ నెంబర్ 449-2లో 18.48 సెంట్లు స్థలాన్ని 2011లో నర్రా ఝాన్సీ లక్ష్మీ వద్ద వెంకటేశ్వరరావు కొనుగోలు చేశారు. ఉషారాణి, నర్రా శ్రీని వాసరావు వద్ద పది సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేశారు. వీరిద్దరు కలిపి సర్వే చేయించి హద్దులను నిర్ణయించిన చోట సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కొందరు సరిహద్దు రాళ్లను ధ్వంసం చేశారు. పోలీసులు వీడియోను పరిశీలించి శనివారం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పార్కింగ్ స్థలం వద్ద వివాదం

పెనమలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పార్కింగ్ స్థలం వద్ద వివాదం అపార్టుమెంటులోని ఫ్లాట్ ఓనరుపై దాడి జరిగిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సయ్యద్ రబ్బానీ యనమలకుదురులోని ఒక అపార్టుమెంటులో రెండు సంవత్సరాల క్రితం ఫ్లాట్ కొనుక్కొని అందులో నివాసముంటున్నాడు. అప్పటి నుంచి కారు పార్కింగ్ స్థలం గురించి బిల్డర్‌తో వివాదం జరుగుతోంది. శుక్రవారం అపార్టుమెంట్ వాచ్‌మెన్ అందుబాటులో లేకపోవడంతో తన కారు ను గేటు తీసి బయటకు పెట్టేందుకు ప్రయత్నించగా పక్క అపార్టుమెంటులోని వీరయ్య అనే వ్యక్తికి చెందిన పనిమనిషి వచ్చి గేట్లు వేశాడు. దీంతో రబ్బానికి వీరయ్య మధ్య ఘర్షణ జరిగింది.

ఘంటసాల కళా సమితి వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఘంటసాల సంగీత కళాసమితి 23 వార్షికోత్సవం సందర్భంగా ఘంటసాల సంగీత విభావరి ఘనంగా నిర్వహించారు. ఘంటసాల ఆ పాత మధురాలను సంగీత కళాకారులు ఆలపించి సంగీత ప్రియులను అలరించారు. ఈ సందర్భంగా మల్లవల్లి గ్రామానికి చెందిన ఘంటసాల పాటల గాయకుడు, పింగళి వెంకయ్య జాతీయ జెండా ప్రచారకర్త ఎస్ ఎం. సుభానీ, కానుమోలు చింతా సీతాయ్య జూనియర్ కాలేజీ విశ్రాంతి అధ్యాపకుడు, గాయకుడు దొడ్డపనేని వెంకటరమణ, ఏలూరుకు చెందిన కీ బోర్డు ప్లేయర్ రాళ్ళపల్లి వెంకటేశ్వరరావులను సమితి నిర్వాహకులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

చురుగ్గా పీ-4 సర్వే

హనుమాన్‌జంక్షన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం దిశా నిర్దేశం చేసిన పీ-4 సర్వే కార్యక్రమాన్ని బాపులపాడు మండలంలో పంచాయతీ,సచివాలయం సిబ్బంది శనివారం ప్రారంభించినట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. బాపులపాడులో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. మండలంలో 26 వేల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా మొదటి రోజు 1596 కుటుంబాలను (6శాతం) సర్వే చేసినట్లు తెలిపారు.

260 కేసులు పరిష్కారం

ఉయ్యూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 170 సివిల్, 90 క్రిమినల్ కేసులను జడ్జి కె శ్రీహరి పరిష్కరించారు. ఈ సందర్భంగా రూ. 16,05,193 జరిమానాగా విధించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.420

అంతర్జాతీయ జలక్రీడల పోటీల్లో నాగిడి గాయత్రి



నాగాయలంక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి థాయిలాండ్‌లో జరుగుతున్న జూనియర్, సీనియర్ విభాగాల అంతర్జాతీయ యు-23 కయాక్ మహిళల జలక్రీడల పోటీలో పాల్గొన్నారు. ప్రపంచ దేశాల నుంచి 47 మంది ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ఆమె ఆంధ్రజ్యోతికి తెలిపింది. ఈ పోటీలు ఈనెల 12వరకు జరుగుతాయన్నారు.




మహిళా దినోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ హారిక, కలెక్టర్ సతీమణి పృథ్వికల్యాణిలకు సత్కారం





గూడూరులో డాక్టర్ అరుణ కాత్యాయని, పెడనలో చైర్‌పర్సన్ నాగకుమారి, చల్లపల్లిలో డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, అవనిగడ్డలో మహిళలకు సత్కారం

మహిళల సేవలు మహోన్నతం

మచిలీపట్నం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల సేవలు మహోన్నతమని, ప్రతి పురుషుని విజయం వెనుక స్త్రీ హస్తం తప్పక ఉంటుందని కలెక్టర్ సతీమణి పృథ్వికల్యాణి అన్నారు. యూ టీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ సతీమణి పృథ్వికల్యాణిని ఘనంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత, యూటీఎఫ్ నాయకులు ఉమామహేశ్వరరావు, సునందన, కనకారావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ జాతీయ స్థాయిలో అవార్డు పొందిన సందర్భంగా ఉప్పాల హారికను జడ్పీ అధికారులు, ఉద్యోగులు, జడ్పీటీసీలు సత్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ హాలులో అధ్యక్షురాలు నూర్జహాన్ ఆధ్వర్యంలో 18 మంది మహిళలను సత్కరించారు. మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సభ్యులు అజ్మతున్నీసా, రియాజ్ హుస్సేన్, పి. పద్మజ, వసంతకుమారి, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు. మహతి కళావేదికపై జరిగిన వేడుకల్లో సంగీత విద్వాంసురాలు ఓరుగంటి ఫణిరాజమహాలక్ష్మి, జానపద కళాకారిణి మాటూరి దమయంతి, తపాలా ఉద్యోగి ఆకుల రేష్మాలను సత్కరించారు. గుడిపూడి రాధికారాణి, శివలెంక ఉషాకిరణ్, ఘంటసాల మహాలక్ష్మి, డాక్టర్ ధన్వంతరీ ఆచార్య, గుత్తికొండ సుబ్బారావు, సి.శేషాచార్యులు, జి. రామబ్రహ్మం, భవిష్య, లంకిశెట్టి బాలాజీ, ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. బెరాకా ఫౌండేషన్ అధినేత డాక్టర్ బి.ఎస్. కిరణ్‌పాల్ రైతుబజారులో 180 మంది మహిళలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్, నాగిశెట్టి డానియేల్, బి. శ్యామ్, ఎన్. బాబు పాల్గొన్నారు. **పెడన** : జిల్లా యువజన సంక్షేమ సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో పెడన పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ నాగకుమారి, కౌన్సిలర్ కొనసం కరుణకుమారిలను ఘనంగా సన్మానించారు. మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు, సీఈవో వెంకటేశ్వరరావు, యువజన సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అర్చన, ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ ప్రశాంతి, పొదుపు సంఘాల ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మ ఫుడ్ ఫౌండేషన్ నిర్వాహకురాలు యర్రా చౌడేశ్వరిని సన్మానించారు. చీరెలు, జాకెట్లు, పసుపు కుంకుమ పంపిణీ చేశారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు.

పెడన రూరల్ : పెడన, బల్లిపర్రు, మడక, గౌడపాలెం, శేరీవర్తర్లపల్లి, పెనుమల్లి, నేలకొండపల్లి, లంకలకలవగుంట, కొంగంచర్ల, గురివిందగుంట, కవిపురం, కమలాపురం అంగన్‌వాడి కేంద్రాల్లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి కేక్‌లు కట్ చేసి వేడుక జరుపుకున్నారు. **గూడూరు** : గూడూరులో డాక్టర్ అరుణ కాత్యాయని తదితరులను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, కట్టా మునీశ్వరరావు, ఎస్‌ఏ బేగ్, పోతన రామోజీ, న్యాయవాది పుప్పాల ప్రసాద్, కోలపల్లి రజని, గొరిపర్తి ఫణి, ఉపాధ్యాయురాలు రాధిక, ఎంపీటీసీ సభ్యురాలు గంజాల చింతలమ్మ, సిడిపిఓ గ్లోరీ, సర్పంచ్ లింగం సులోచనారాణి, మెరుగు పద్మావతి తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చల్లపల్లి లయన్స్‌క్లబ్, గోదావరి - కృష్ణా బ్యాంకు చల్లపల్లి బ్రాంచ్ మేనేజర్ బి.కిషోర్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, పెద్దలు నర్రా సాయిబాబు, ఏపీ ఎల్ఆర్‌కె.ప్రసాద్, వరదా హరిగోపాల్, కొల్లిపర మధు, వేమూరి మురళీకృష్ణ, ఏపీ.చంద్రశేఖరరావు, ఉప్పల సాంబశివరావు, కంఠంనేని సుధాకరరావు పాల్గొన్నారు. కస్తూర్బా ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ వరదా హరిగోపాల్ ఆధ్వర్యంలో ఆసుపత్రి డాక్టర్ సిహెచ్.సుమాచౌదరి, హెడ్ నర్స్ మంగతాయారు, నర్స్ ఎల్లమ్మ, ఫార్మాసిస్ట్ కల్యాణి, ఎల్‌డీసీ శాంతకుమారి, ఓటీ అసిస్టెంట్ శాంతి, జీడీఏ హుస్సేన్‌బీ, కార్మికురాలు జయలను సత్కరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఉమామహేష్, డాక్టర్ సుమ, డాక్టర్ రామకృష్ణ తదితరులున్నారు. చల్లపల్లి సీఆర్ ట్రస్ట్ ఆవరణలో మండల వైసీపీ అధ్యక్షుడు వెనిగళ్ల తారక జగదీష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులను ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, సర్పంచ్‌లు వల్లూరు ఉమ, మాతంగి రమ్య, కళ్లేపల్లి లక్ష్మి, వార్డు సభ్యులు బళ్ల లలితకుమారి, ఉప్పల వెంకటేశ్వరమ్మ, నేతలు బొందలపాటి లక్ష్మి, మేరుగు ఝాన్సీలక్ష్మిలను సన్మానించి స్వీటు బాక్సులు అందించారు. ఈ కార్యక్రమంలో నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్, నేతలు మోపిదేవి ద్వారకానాథ్, రాజులపాటి శివప్రసాద్, పాగోలు ఫణి తదితరులు పాల్గొన్నారు. వక్కలగడ్డ శ్రీకమలా నెహ్రూ మహిళా మండలిలో హనుమానుల రాణీకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరు ఉమ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, రైతు సంఘం నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, విశ్రాంత ఉద్యోగిని గూడూరు భాగ్యలక్ష్మి, హేమలత, ప్రసన్న పాల్గొన్నారు. **కోడూరు** : పాలకాయితిప్ప మెరైన్ సీఐ సురేష్ రెడ్డి సారథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హంసలదీవి బీచ్ నందు బీచ్‌కి వచ్చిన మహిళ యాత్రికులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు మెరైన్‌పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సిబ్బంది పోతురాజు, రహమాన్, ఆలీ, ఆనందరాజు, స్విమ్మర్ సుధాకర్ పాల్గొన్నారు. జన సేన పార్టీ కార్యాలయం వద్ద లింగారెడ్డిపాలెం సర్పంచ్ యర్రంశెట్టి శ్రీదుర్గా, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యురాలు బచ్చు కృష్ణకుమారి, తోట మానసల ఘనంగా సత్కరించారు.మండల పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, పిట్టలంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, కోట రాంబాబు, తోట సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీని ఘనంగా సత్కరించారు. విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ కార్యాలయం వద్ద విక్కుర్తి వీరరాఘవయ్య సతీమణి వియమ్మను పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆర్థిక సహకారంతో పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను రెడ్‌క్రాస్ సొసైటీ ఘనంగా సత్కరించింది. జనసేన నేత మండలి వెంకట్రామ్, గుడివాక శేషుబాబు, వి.శేషగిరిరావు, మత్తి శ్రీనివాసరావు, కూటమి నేత కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో ఆసుపత్రి సిబ్బందికి సత్కారం




కోడూరు, నాగాయలంకలో జనసేన ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం



వార్షికోత్సవంలో పాఠశాల నివేదిక సమర్పిస్తున్న హెచ్‌ఎం అనురాధ, పెదప్రోలు జడ్పీ విద్యార్థుల నృత్య ప్రదర్శన

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మోపిదేవి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు ప్రముఖులు విద్యార్థులకు సూచించారు. పెదప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 22వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పోలిమేట్ల ఏసుబాబు జాతీయ పతాకం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.అనురాధ పాఠశాల నివేదికను సమర్పించారు. బాలికలు స్వాగత గీతం ఆలపిస్తూ అతిథులను ఆహ్వానించారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, గ్రామ సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, గ్రామ ప్రముఖులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎంతో మంది ప్రముఖులు ఉదార స్వభావాన్ని చాటి లక్షల రూపాయలు విరాళాలుగా అందించడం అభినందనీయమన్నారు. క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పాఠ్యాం శాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖులు ఆకుల వెంకట్రామ య్య, రావి దుర్గా సుధాకర్‌రెడ్డి, ఆది రవీంద్రబాబు, నెరుసు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 228 కేసుల పరిష్కారం

అవనిగడ్డ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 228 కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్, మొవ్వ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్ పర్యవేక్షణలో 228 కేసులు పరిష్కరించి మొత్తం రూ.4.65 లక్షల మొత్తాన్ని కక్షిదారులకు అందజేశారు.

జనసేన సమావేశం నేడు

పెడన రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో జరిగే ఆవిర్భావ దినోత్సవ సభకు తరలి వెళ్లేందుకు ఈనెల 9వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెడన నియోజకవర్గ స్థాయి సమావేశం బంటుమిల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పెడన నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త పంచకర్ల సురేష్ తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ ఆవిర్భావ సభకు హజరు కావాలన్నారు.

నూతన వధూవరులకు వెంకట్రామ్ ఆశీస్సులు

కోడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామంలోకూరాకుల శ్రీనివాస్ గాంధీ - యామిని వివాహ మహోత్సవం సందర్భంగా వారిని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ ఆశీర్వదించారు. మండల పార్టీ అధ్యక్షుడు మర్రె గంగయ్య, ఎంపీటీసీ సభ్యుడు లంకే భాస్కరరావు, చంద్రశేఖర్, కృష్ణబాబు, వెంకటేశ్వరరావు, రాంబాబు, కరుణ్ కుమార్, కాగిత రామారావు, శివయ్య, ప్రసాద్, బచ్చు వెంకటేష్, అప్పికట్ల వినోద్, చందు రామాంజనేయులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

మచిలీపట్నం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం బొర్రపోతుపాలెంలో రైలు ఢీకొని కాగిత శివనాగరాజు (38) మృతి చెందాడు. పొలానికి వెళుతూ పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రైల్వే పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

బచ్చు ప్రదీప్‌కు వాకర్స్ నివాళి

అవనిగడ్డ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో అవయవ దానం ద్వారా పలువురికి పునర్జన్మనిచ్చిన బచ్చు ప్రదీప్‌కు అవనిగడ్డ వాకర్స్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది తిమ్మన సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు రాఘవరావు, నాగభూషణం, పరుచూరి రాఘవేంద్రరావు, పీడీలు కోసూరు పూర్ణచంద్రరావు, మాధవరావు, శంకరరావు, ఎంఈవో టి.రామదాసు, ఏఎస్సై గణేష్ తదితరులు ప్రదీప్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మచిలీపట్నం - తిరుపతి రైలు పునరుద్ధరించాలి

మోపిదేవి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నుంచి తిరుపతికి గతంలో ఉన్న రైలు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్‌కు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. విశ్వహిందూ పరిషత్ మోపిదేవి మండల శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం డివిజన్ రైల్వే మేనేజర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం నుంచి తిరుపతి, అరుణాచలం వరకు రైలు సర్వీసును పునరుద్ధరించాలని వల్నాటి వెంకట స్వామి నాయుడు, వెలుగంటి శివాజీ, అరజా ఏడుకొండ ఆయనకు విజ్ఞప్తి చేశారు.

రుద్రవరం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను శనివారం సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం, టి. చంద్రపాల్, ఎండీ యూనస్, చాందినీ దుర్గ, డీవైఎఫ్‌ఐ నాయకులు టి. యువకిషోర్ సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు.

కె.వి.రమణయ్య నాయుడు జయంతి నేడు

మచిలీపట్నం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ప్రజాప్రతినిధి, విద్యా ప్రదాత కొల్లిపర వెంకట రమణయ్య నాయుడు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. బందరు తాలూకా బోర్డు ప్రెసిడెంట్‌గా, మచిలీపట్నం మునిసిపల్ ఛైర్మన్‌గా, కేడీసీ బ్యాంకు ఛైర్మన్‌గా, మద్రాసు కో ఆపరేటివ్ యూనియన్ బ్యాంకు డైరెక్టర్‌గా, మద్రాసు కోఆపరేటివ్ ఫైర్ అండ్ జనరల్ ఇన్సూరెన్స్ సొసైటీ డైరెక్టర్‌గా, బందరు శాసన సభ్యుడిగా ఆయన విశేష సేవలందించారు.

వేకనూరులో బంతిపూల కనువిందు



అవనిగడ్డ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఆ ఇల్లు హరివిల్లుగా దర్శనమిస్తోంది. ఆహ్లాదాన్ని పంచే ఆ ఇల్లు చూడాలంటే వేకనూరు గ్రామానికి వెళ్లాల్సిందే. గ్రామంలోని రేషన్ డీలర్ గుడివాక శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో బంతిపూలు విరగకాసి కనువిందుచేస్తున్నాయి. అవనిగడ్డ, మోపిదేవి తదితర ప్రాంతాలకు వెళ్లి కాలానుగుణంగా పూసే వివిధ రకాల మొక్కలను తెచ్చి పెరటిలో నాటగా, బంతిపువ్వులు విరబూసి ఆకర్షిస్తున్నాయి.

ఆవు దూడలు కోసి విక్రయిస్తున్నారని ఫిర్యాదు

చల్లపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి దళితవాడలో ఆవు దూడలను కోసి మాంసం విక్రయిస్తున్నారని డానియేల్ అనే వ్యక్తిపై మచిలీపట్నానికి చెందిన సొసైటీ ఫర్ ప్రివెన్షన్ అగైనెస్ట్ యానిమల్ సంస్థ మాజీ సభ్యుడు జన్ను వెంకట గణేష్ శనివారం ఫిర్యాదు చేశారు. యానిమల్ క్రూయల్ యాక్ట్ ప్రకారం చల్లపల్లి ఎస్ఐ పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు.పోలీసులు, పెదకళ్లేపల్లి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ గుల్జార్‌బేగం సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. పరీక్షల నిమిత్తం మాంసాన్ని శాంపిల్ సేకరించారు. అనంతరం ఖననం చేశారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతి

గుడివాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : శాసనమండలిలో ఉద్యోగ,ఉపాధ్యాయ, పట్టభద్రుల గొంతుకగా నిలవాలని, విద్యారంగ, ఉపాధ్యాయ, ఉద్యోగ, పట్టభద్రుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎస్‌టీయూ కోరింది. శనివారం గుంటూరులోని ఆలపాటి కార్యాలయంలో ఆయనను ఎస్‌టీయూ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఇమ్మానియేల్, డి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆలపాటిని అభినందిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

ఉచిత వైద్య శిబిరం నేడు

గుడ్లవల్లేరు మార్చి 8(ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మధుమేహ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించనున్నట్టు శిబిర కోఆర్డినేటర్ మూల్పూరి సుధాకర్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నందివాడ, గుడ్లవల్లేరులకు ఆర్టీసీ బస్సులను నడపాలి

గుడివాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని గ్రామాలకు రెండు నెలలుగా ఆర్టీసీ బస్సుల కనెక్టివిటీ సరిగ్గా లేకపోవడం చాలా బాధాకరమని న్యాయవాది అల్లూరి హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడ్కో కాలనీలో బస్ షెల్టర్ ఏర్పాటు చేసి గుడివాడ-మచిలీపట్నం, కాజ బస్సు సర్వీసులు వయా టిడ్కో కాలనీ, ఎన్టీఆర్ కాలనీల మీదగా మళ్లించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కోరారు. రెండు నెలలుగా ఆపిన గుడివాడ - కాజ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. జోకిపర్రులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయ, ఇతర ఆలయాల భక్తులకు ఉపయోగకరమన్నారు. గుడివాడ డిపో మేనేజర్ త్వరితగతిన బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని న్యాయవాది హేమంత్ కుమార్ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక మందపాడు, చౌదరిపేట రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు రైల్వే ఎస్సై మహబూబ్ షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వయస్సు సుమారు 40-45 సంవత్సరాలు ఉంటుందన్నారు. రైలు నుంచి జారిపడిన వ్యక్తి స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్సై తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నత్త వాణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పెదపారుపూడి: ప్రతి మహిళా భయాన్ని విడనాడి అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గత వైసీపీ హయాంలో టీడీపీ నాయకులను , కార్యకర్తలపై అనేక కేసులు పెట్టి భయాందోళనలకు గురి చేసినప్పటికీ వాటిని ఎదుర్కొని టీడీపీకి అండగా నిలబడిన మహిళా కార్యకర్త నత్త వాణి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఆమెను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఇందిరా పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో మహిళాదినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏఏఎన్ఎమ్ హైస్కూల్‌లో కుకింగ్ విత్‌ఔట్ ఫైర్, టెన్నికాయిట్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్ వంటి ఆటలను విద్యార్థుల తల్లులకు నిర్వహించారు. ముఖ్యాతిథిగా ఏపీ ఉమెన్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు అక్కినేని వనజ వ్యవహరించారు. హనుమాన్‌జంక్షన్ ఆశాజ్యోతి ఫౌండేషన్ డైరెక్టర్ మాధవీలత, సింగలూరు పర్యావరణహిత ఉత్పత్తుల సంస్థ బండారు సరస్వతి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లీనా సాతులూరి, ఉపాధ్యాయినిలు శ్రీలత, శ్రీలక్ష్మి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళను మహిళాదినోత్సవ సందర్భంగా మహిళలు, సభ్యులు సత్కరించారు. గ్రామపంచాయితీ గుడ్లవల్లేరు మండల పరిషత్ మహిళా ఉద్యోగినులను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయసారథి ఆధ్వర్యంలో సన్మానించారు.



డీఎల్‌పీవో సంపతకుమారిని సత్కరిస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ తదితరులు

గుడివాడ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో పది మండలాల ఈవోపీఆర్‌డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో డీఎల్‌పీవో సంపతకుమారిని శనివారం సన్మానించారు. అనంతరం ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్, డివిజనల్ సర్వేయర్ రాజబాబు, ఈవోపీఆర్‌డీలు, పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ మహిళా ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఒక్కో ఉపాధ్యాయురాలు చేసిన సేవలను కొనియాడారు.



మహిళలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు వెలుగు కార్యాలయంలో శనివారం హ్యూమన్ రైట్ మిషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలునిర్వహించారు. వెలుగు ఏపీఎం సాంబశివరావు, హ్యూమన్ రైట్ మిషన్ అధ్యక్షుడు టీ సుధాకర్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు మహిళలను సత్కరించారు.

టీడీపీ కార్యాలయంలో : తోట్లవల్లూరు టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మహిళా నేతలు ఈడ్పుగంటి లక్ష్మీశ్రీ, గోలి సింహాచలం, జుజ్జువరపు పద్మజలను శాలువాలతో సత్కరించారు. అనంతరం వారికి రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు గోపయ్య, గుత్తా రామకృష్ణ, చిరుమామిళ్ల మోహన్ మంజూ పాల్గొన్నారు.



టీచర్లను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి ఉదయ్ ప్రకాష్

లోక్ అదాలత్‌లో 346 కేసుల పరిష్కారం

కూచిపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయమూర్తి పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్ ద్వారా రాజీ పడ దగిన కేసులు, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు ,అన్ని రకాల సివిల్ కేసులు కలిపి 346 కేసులు వరకు పరిష్కారం లభించినట్టు న్యాయస్థాన వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో పీపీ తాండవ కృష్ణ, న్యాయస్థానం పర్యవేక్షకులు నిరంజన్, ఘంటసాల, చల్లపల్లి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. కూచిపూడి, ఘంటసాల, చల్లపల్లి మండలాలతోపాటు మొవ్వ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కేసులు సైతం పరిష్కారమైనట్టు సమాచారం.

భద్రిరాజుపాలెం పాఠశాల వార్షికోత్సవం

తోట్లవల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భద్రిరాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత కే బాపిరెడ్డి పలువురు విద్యార్థులకు రూ. 44 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు చాగంటి తిమ్మారెడ్డి ప్రధానోపాధ్యాయిని జే సునీత పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహం అందిస్తున్న బాపిరెడ్డి

గ్రామీణాభివృద్ధికి స్వామిత్వ పథకం మైలురాయి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కె.సంపతకుమారి

పామర్రు,మార్చి8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ అభివృద్ధి సాధికారత సాధనకు కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్జేస్తున్న స్వామిత్వ పథకం ఓ మైలురాయని డివిజనల్ పంచాయతీ అధికారిణి కె.సంపతకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉయ్యూరు డివిజన్ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు స్వామిత్వ సర్వేపై కొనసాగుతున్న శిక్షణా తరగతులకు ఆమె ముఖ్యాతిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి అవగాహనతో మెలగాలని, గ్రామీణప్రాంత ఆస్తి యజమానులకు చట్టపరమైన యాజమాన్య పత్రాలను అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ,ప్రయివేట్ వ్యక్తుల ఆస్తులను సాంకేతిక పరికరాలతో విశదీకరణ చేయడం వల్ల భూ యజమానులకు ఆర్థిక సాయం, రుణాలు, వారివృద్ధికి దోహదపడే అవకాశాలు ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో సాంకేతిక పరికరాలతో నిర్వహించే స్వామిత్వ సర్వే పట్ల అవగాహన కల్పించారు. సర్వేలో పాల్గొనేవారికి వచ్చిన పలు సందేహాలను ఆమె నివృత్తిచేశారు. కార్యక్రమంలో డివిజన్ ల్యాండ్ సర్వే ఇన్‌స్పెక్టార్ శివరామ ప్రసాద్, శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో కెజ్యోతి, ఈవోపీఆర్‌డీ కిషోర్, మాస్టర్‌ట్రైనీలు, డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎంపికైన బాలుర కబడ్డీ జట్టు



ఎంపికైన బాలికల కబడ్డీ జట్టు

సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

కూచిపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ (16 సంవత్సరాల లోపు) బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు అప్పికట్ల రామారావు, మండలి మనోహరి పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపికలో బాలుర విభాగంలో 12 మంది క్రీడాకారులతో పాటు మరొక ఆరుగురిని (రిజర్వుడు) ఎంపిక చేశారు. అలాగే బాలికల విభాగంలో 15 మంది క్రీడాకారిణినులను సెలెక్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు పి.రవీంద్ర బాబు (తాడంకి), బీపీఎస్.ప్రసాద్ (లింగారెడ్డిపాలెం), ఆర్.శ్రీధర్ (మేడూరు), వి.వెంకటేశ్వరరావు (అల్లూరు), ఎస్.కృష్ణ ప్రసాద్‌నాయక్ (మల్లెల), కళ్యాణి (శాప్ కోచ్) తమ సహకారాన్ని అందజేశారు. కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలలోని 37 పాఠశాలల నుంచి 150 మందిపైగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. క్రీడాకారులకు యూనిఫారం కృష్ణా జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు బహూకరించారు.

సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం : ఎంఈవో

గుడివాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేయాలని మండల విద్యాశాఖాధికారి బాలాజీ పేర్కొన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పోను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి బాలాజీ, విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ ఆర్.మంజులలు ముఖ్యాతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన హ్యాండ్ మేడ్ రోబో, చంద్రయాన్-3 నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆర్.మంజుల, ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజీ

తుది దశకు చేరుకున్న గంగానమ్మ జాతర



సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన అమ్మవారి ఆలయం

పామర్రు,మార్చి8(ఆంధ్రజ్యోతి): పామర్రు గంగానమ్మఅమ్మవారి జాతర మహోత్సవం తుదిదశకు చేరుకుంది. అమ్మవారి గ్రామసంచార యాత్ర శనివారం గాంధీనగరం, బ్యాంకు కాలనీ, కోతిబొమ్మడొంక, ఎమ్మెల్యేబజారు, తదితరప్రాంతాల్లో డప్పు, సన్నాయివాయిద్యాల మధ్య అమ్మవారిఘటం, పోతురాజుగెడలతో కొనసాగింది. భక్తులు పసుపు, వేపాకులనీటిని వారబోసి, పసుపు కుంకుమలతో పోతురాజు గెడ కింద కుటుంబ సమేతంగా ఓలలాడారు. గ్రామసంచార యాత్ర అర్ధరాత్రి 2గంటలవరకు కొనసాగింది. ఆదివారం ప్రధాన జాతర మహోత్సవం ఆలయం వద్ద ఘనంగా జరగనుంది. దీని నిమిత్తం ఆలయం వద్ద బారీకేడ్లతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు ఆలయ ఉత్సవ కమిటీ తీసుకుంది. ఆలయం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను పోలీసుశాఖధికారులు పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలను అందించారు.

క్యాంపస్ ఎంపికల్లో గుడ్లవల్లేరు విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు మార్చి 8(ఆంధ్రజ్యోతి) : భారతదేశానికి గర్వకారణమైన ఎయిరోస్పేస్ కంపెనీ రొసెల్ టెక్సిస్ సంస్థ శనివారం నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులు 23మందికి ఉద్యోగావకాశాలు లభించాయని ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో 12మంది, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ విభాగంలో 11మందికి వార్షికవేతనం రూ.3లక్షలతో ఉద్యోగాలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో క్యాంపస్ ఎంపికలు నిర్వహించింది కేవలం గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లోనే కావడం విశేషం. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.వినయ్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి జి.వి.వి. సత్యన్నారాయణ లను యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజశేఖర్

పేదలకు నిత్యావసరాలు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దైవసేవకులు

పెదపారుపూడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గురివిందగుంటలో క్రీస్తు సంఘము వారి లవ్ అండ్ కంప్యాషన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ వార్షిక సువార్త సభలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సభలలో దైవ సందేశాలను దూర ప్రాంతముల నుంచి వచ్చిన సువార్తికులు బోధించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని మాట్లాడారు. అనంతరం లవ్ అండ్ కంప్యాషన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ దగాని సుజిత్ ప్రేమ్ గ్రామంలో ఉన్న నిరుపేదలకు, వృద్ధులకు నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ చేశారు. రోగులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. పెదపారుపూడి తహసీల్దార్ వై.రంగారావు, ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్సీ సాధికార సంఘ అధ్యక్షుడు దగాని లెనిన్, సభల కన్వీనర్ ఐ.మధుసూదనరావు, వి.శేఖర్, మండల నాయకులు పాల్గొన్నారు.